శ్రీరస్తు

శ్రీ శివ నామావళి అష్టకమ్

(శ్రీ శంకరాచార్య విరచితం)

- భావార్థముతో -

శుభమస్తు



అవిఘ్నమస్తు

సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

శ్రీ శివ నామావళి అష్టకమ్ - భావార్థముతో -

01. హే చంద్రచూడ మదనాంతక శూలపాణే
స్థాణో గిరీశ గిరిజేశ మహేశ శంభో।
భూతేశ భీతభయసూదన మామనాథ
సంసార దుఃఖ గహనాత్ జగదీశ రక్ష॥

ఓ చంద్రుడు తలపై నున్న ఈశ్వరుడా! మన్మథుని సంహరించినవాడా! చేతిలో శూలము ధరించినవాడా! శాశ్వతుడా! కైలాసముపై నుండువాడా! పార్వతీపతీ! మహేశుడా! శంభో! భూతనాథుడా! భయపడువారి భయములను పోగొట్టువాడా! అనాథుడనైన నన్ను సంసార దుఃఖారణ్యము నుండి రక్షించుము.

– – – = – – –

02. హే పార్వతీహృదయవల్లభ చంద్రమౌళే
భూతాధిప ప్రమథనాథ గిరీశచాప।
హే వామదేవ భవ రుద్ర పినాకపాణే
సంసార దుఃఖ గహనాత్ జగదీశ రక్ష॥

ఓ పార్వతీ హృదయ వల్లభుడా! చంద్రమౌళీ! భూత నాథుడా! ప్రమథగణములకు నాయకుడా! మేరు పర్వతమును విల్లుగా చేసుకున్నవాడా! ఓ వామదేవుడా! భవుడా! రుద్రుడా! పినాకపాణీ! జగదీశుడా! నన్ను సంసార దుఃఖారణ్యము నుండి రక్షింపుము.

– – – = – – –

03. హే నీలకంఠ వృషభధ్వజ పంచవక్త్ర
లోకేశ శేషవలయ ప్రమథేశ శర్వ।

హే ధూర్జటే పశుపతే గిరిజాపతే మాం
సంసార దుఃఖ గహనాత్ జగదీశ రక్ష॥

ఓ నల్లని కంఠము వాడా! జెండాపై ఎద్దు గుర్తు కలవాడా! ఐదు ముఖము లున్నవాడా! లోకేశ్వరుడా! సర్పములను కంకణములుగా ధరించిన వాడా! ప్రమథ గణములకు నాయకుడా! శర్వుడా! బరువైన జటలు కలవాడా! పశుపతీ! గిరిజాపతీ! జగదీశుడా! నన్ను సంసార దుఃఖారణ్యము నుండి రక్షింపుము.

– – – = – – –

04. హే విశ్వనాథ శివశంకర దేవదేవ
గంగాధర ప్రమథనాయక నందికేశ।
బాణేశ్వరాంధక రిపో హర లోకనాథ
సంసార దుఃఖ గహనాత్ జగదీశ రక్ష॥

ఓ విశ్వనాథుడా! శివుడా! శంకరుడా! దేవతలకే దేవుడైన వాడా! గంగను ధరించిన వాడా! ప్రమథగణములకు నాయకుడా! నందీశ్వరుని ఏలెడువాడా! బాణాసురుని కాపాడిన వాడా! అంధకుడను రాక్షసుని సంహరించిన వాడా! హరుడా! లోకనాథుడా! జగదీశుడా! నన్ను సంసార దుఃఖారణ్యము నుండి రక్షింపుము.

– – – = – – –

05. వారాణసీపురపతే మణికర్ణికేశ
వీరేశ దక్షమఖకాల విభో గణేశ।
సర్వజ్ఞ సర్వహృదయైక నివాస నాథ
సంసార దుఃఖ గహనాత్ జగదీశ రక్ష॥

వారాణసీపట్టణమునేలు వాడా! మణికర్ణికా ఘట్టమును పాలించు వాడా! వీరేశుడా! దక్షుని యజ్ఞమును నాశనము చేసిన వాడా! అంతటా వ్యాపించిన వాడా! ప్రమథగణము లకు నాయకుడా! అన్నీ తెలిసిన వాడా! అందరి హృదయములందు నివసించు వాడా! ప్రభూ! జగదీశుడా! నన్ను సంసార దుఃఖారణ్యము నుండి రక్షింపుము.

– – – = – – –

06. శ్రీమన్మహేశ్వర కృపామయ హే దయాళో
హే వ్యోమకేశ శితికంఠ గణాధినాథ।
భస్మాంగరాగనృకపాల కలాప మాల
సంసార దుఃఖ గహనాత్ జగదీశ రక్ష॥

శ్రీమంతుడగు మహేశ్వరా! కృపకలవాడా! దయామయీ! ఆకాశమే జుట్టుగా కలవాడా! నల్లని కంఠమున్న వాడా! ప్రమథగణములకు నాయకుడా! భస్మమును పూసుకున్నవాడా! మానవుల కపాలములను మాలగా ధరించినవాడా! ఓ జగదీశుడా! నన్ను సంసార దుఃఖారణ్యము నుండి రక్షింపుము.

– – – = – – –

07. కైలాసశైలవినివాస వృషాకపే హే
మృత్యుంజయ త్రినయన త్రిజగన్నివాస।
నారాయణప్రియ మదాపహ శక్తినాథ
సంసార దుఃఖ గహనాత్ జగదీశ రక్ష॥

కైలాస పర్వతము నందు నివసించువాడా! ధర్మస్వరూపుడైన జగద్రక్షకుడా! మృత్యువును జయించినవాడా! మూడు కన్నులు కలవాడా! మూడు లోకములందు నివసించు వాడా! నారాయణునకు ఇష్టుడైన వాడా! గర్వమును పోగొట్టు వాడా! శక్తి స్వరూపిణి అగు పార్వతికి నాథుడా! ఓ జగదీశుడా! నన్ను సంసార దుఃఖారణ్యము నుండి రక్షింపుము.

08. విశ్వేశ విశ్వ భవనాశక విశ్వరూప
విశ్వాత్మక త్రిభువనైక గుణాధికేశ।
హే విశ్వనాథ కరుణామయ దీనబంధో
సంసార దుఃఖ గహనాత్ జగదీశ రక్ష॥

విశ్వము నేలెడివాడా! సమస్త ప్రపంచములకు పుట్టుక మొదలగు దుఃఖములను నశింప చేయువాడా! విశ్వ స్వరూపుడా! విశ్వమునకు అంతరాత్మయైన వాడా! మూడు లోకములందు అధిక గుణములున్న ఒక్కడైన ఈశ్వరుడా! ఓ విశ్వనాథుడా! కరుణామయుడా! దీనులకు బంధువైన వాడా! ఓ జగదీశుడా! నన్ను సంసార దుఃఖారణ్యము నుండి రక్షించుము.

– – – = – – –

09. గౌరీ విలాస భవనాయ మహేశ్వరాయ
పంచాననాయ శరణాగత కల్పకాయ।
శర్వాయ సర్వజగతామధిపాయ తస్మై
దారిద్ర్య దుఃఖ దహనాయ నమః శివాయ॥

నమః శివాయ! నమః శివాయ!

పార్వతీ విలాసములకు నివాసమైన వాడు, మహేశ్వరుడు, ఐదు ముఖములున్న వాడు, శరణు పొందిన వారి కోరికలు తీర్చు కల్పవృక్షము, సర్వరూపుడు, సమస్త ప్రపంచములను పాలించువాడు, దారిద్ర్య దుఃఖమును తగులబెట్టువాడు అగు ఆ పరమేశ్వరునకు నమస్కారము.

– – – = – – –

– – ॥ శ్రీ శివ నామావళి అష్టకం సమాప్తమ్ ॥ – –



(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి.–944 044 9650, 994 994 1430)